"నా నవలకు ప్రయిజురాక నేను మూడ్రోజులు వంటచేయకుండా తిరిగొచ్చిన నవలను పక్కలో పెట్టుకుని కుళ్ళి కుళ్ళి శోకిస్తూంటే వారే వంటచేసి నాకు బెడ్ కాఫీ దగ్గర్నుంచీ అందిచ్చి నాకు కన్నీరింకిపోయి, ఇక నేను అశోకినైతే, నా బదులుకూడా వారే కన్నీరు మున్నీరుగా ఏడ్చిన ఘట్టం, నాకిప్పటికీ పచ్చిపచ్చిగా మనో ఫలకంమీద, సినిమా రీలులా తిరుగాడుతూనే వుంటుంది" ఇలా వుంటాయి సంగతులు.

హనుమాయమ్మ డైరీలు మీకు చదవాలనుందా? హనుమాయమ్మ మొగుడెవరో మీకు తెలుసుకోవాలనుందా! – హనుమాయమ్మ డైరీలు రాస్తా న్రాస్తాన్. నన్ను చంపకండర్రా బాబూ!

# గాంధీపిచ్చోడు

"మా బుచ్చి సుందరరామయ్య బావొచ్చాడండీ" అన్నాన్నేను.

మావారు బావేమిటి? బావెవరు? అన్నట్లు బాధగా చూశారు. బావ కాదులెండి. మా అమ్మ బావంటుందికదా అని చిన్నప్పట్నుంచి నాకలా అలవాటయింది పిలవటం. "చంపేశావ్ పో!" అన్నారు. తెలుగువాళ్ళ పిలుపులన్నీ యిలా మకతికగానే వుంటాయిలెండి అన్నా. నిఝంకూడా – మా చుట్టాల్లో అందర్నీ వరసల్తో పిలవరు. మెజారిటీ, మైనారిటీ ఎలా పిలుస్తే అలాపిలుస్తారు. అసలు బుచ్చి సుందరరామయ్యని అంతా పిచ్చి సుందరరామయ్య అనికూడా వ్యవహరిస్తారు. మా నాన్న వేలువిడిచిన పింతండ్రి. మా అమ్మమ్మ వేలువిడిచిన మేనమావ మనవరాలు చిట్టివెంకటలక్ష్మి మొగుడు పిచ్చి సుందరరామయ్య. మేకపాల్తో కాచిన కాఫీగాని అతను తాగడు. రాత్రిళ్ళు వేరుశెనగ పలుకులు భోంచేస్తాడు. మధ్యాహ్నం పచ్చికూరలు తింటాడు. పచ్చికూరల్ని చాకుతో తరుక్కుని నిమ్మఉప్పు వేసుకొని గేద్దూడలా పరుకూ పరుకూ నముల్తాడు.

మా పిచ్చి సుందరరామయ్యని ఊళ్ళో అంతా "గాంధీ పిచ్చోడ"నే వారు. తను స్వయంగా వడికిన నూలుతోనేసిన బురఖాలాటి లాల్చీ వేసుకుని, గోనెగుడ్డలాటి ఖద్దరుపంచె కట్టుకుని చెప్పులు లేకుండా తిరిగేవాడు. బంక మట్టి తలకు పట్టీవేసుకుని కాలవలో గంటన్నర నానేవాడు. చిన్నగుండ్రాయి సబ్బుబిళ్ళతో వళ్ళు రుద్దుకునేవాడు. మాలపల్లికి వెళ్ళి అక్కడ గాంధీ మహాత్ముడు పదకొండో అవతారం అని హరికథల్చెప్పేవాడు. పిచ్చి సుందరరామయ్య దేశభక్తిపాటలు పాడుతూ రోడ్లు ఊడ్చేవాడు. "వందేమాతరం" "గాంధీకి జై" అంటే స్కూలు పిల్లలకి పిప్పరమెంట్లు పంచి పెట్టేవాడు. ఆస్తి అంతా కాంగ్రెసుకి దోచిపెట్టేస్తాడేమోనని పెద్దవాళ్లు పొలంపుట్రా, ఇల్లూ, తోట, దొడ్డీ, అంతా భార్య చిట్టి వెంకటలక్ష్మి పేర పెట్టించేశారు. మా బావకి చివరకు తిండికూడా సరిగ్గా పెట్టేదికాదని అంటారు. రాత్రిళ్ళు అరుగుమీద పడుకుని మొల్లరామాయణంలోని పద్యాలు గొంతెత్తి శ్రావ్యంగా చదివేవాడు.

పిచ్చి సుందరరామయ్యకి రామదాసుకీర్తనలు చాలా వచ్చు. అవి, చాలా బాగా పాడేవాడు. చిట్టివెంకటలక్ష్మి సోక్రటీస్, అబ్రహంలింకన్, లియోటాల్‌స్టాయ్, ఉద్దాలకుడి భార్యల్ని మించిపోయింది. ఇటు గయ్యాళి తనాన్ని అటు వడ్డీవ్యాపారాన్ని పెంచి యమపవర్ ఫుల్లై పోయింది. ఆడదానికి డబ్బుదాహం మగాడికంటె మిలియన్ బిలియన్‌లు హెచ్చు అని ఆవిడ అక్షరాలా రుజూచేసిపారేసింది. మాతృస్వామికం ఎంత అనర్థదాయకమో చిట్టి వెంకటలక్ష్మి పరిపాలనలో రుజువయింది. కాని సంసారాన్ని బాగుచేస్తోందనే పేరు గడించటంవలన తనఖాలు, వడ్డీవ్యాపారాలు, గేదెలు, పాలవ్యాపారం అన్నీ చాకచక్యంగా మగపురుషుడి తలదన్నేలా నిర్వహించడంవలన ఆవిడ రాణీరుద్రమదేవి అనిపించుకుని ఆ మాత్రం యీ మాత్రం లాకాయి లూకాయిగాళ్ళ నోరు నొక్కిపారేసింది. తన తమ్ముళ్ళనీ తమ్ముళ్ళ భార్యల్నీ వారివారి సంసారాల్నీ తన సామ్రాజ్యంలో కలిపేసుకుని తనసర్వం సహాధికారాన్ని విస్తరింపచేసుకుని సుస్థిరం చేసుకుంది. పిచ్చిసుందరరామయ్యని తనతమ్ముళ్ళచేత చావచితకకొట్టించి ఊళ్ళోంచి తరిమేసింది. తమ్ముడి పిల్లలను పెంచుకుంది. పిచ్చిసుందరరామయ్య చిట్టి వెంకటలక్ష్మి పెట్టేబాధల్ను భరించలేక 'గాంధీకి జై' అని వూళ్ళోంచి లేచిపోయి వార్ధాచేరుకున్నాడు. కాంగ్రెసు సన్యాసుల్లో కలిసిపోయాడు దీని మొగుడన్నారా ఊళ్ళో అంతా.

"గాంధీ పిచ్చోడు" అలా క్రమక్రమంగాకాంగ్రెసు పిచ్చోడయాడు. పిచ్చి పిచ్చే. ఏదైనా ఒకటే – అసలు మా పిచ్చి సుందరరామయ్యకు బ్రిటిష్‌వాళ్ళని తరివేయటం ఏమంత పెద్ద ఘనకార్యంలా అనిపించివుండదు చిట్టి వెంకటలక్ష్మి ముందు. తెల్లవాళ్ళ దొరతనంవారి అన్యాయాలు అతని కంటికి ఆట్టే ఆనివుండవు. ఐదారుసార్లు జైలు కెళ్ళి, వెళ్ళినప్పుడల్లా ఆర్నెల్లకు తక్కువగాకుండా అత్తారింట్లో గడిపివచ్చాడు. జైల్లో అతను చాలా పుస్తకాలు చదివాట్ట. స్వతహాగా మంచివాడు కావటంవలన కల్లాకపటం తెలీని మనిషి కావటంవలన, కాంగ్రెస్‌లో అతనేవంత పైకి రాకపోయినా 1947 తరవాత అతని ప్రభ తిరిగిపోయి రైతు కూలి ప్రజానాయకుడై పోయాడు. బంతిపూల దండలేసి లారీమీద ఎక్కించి "జై సర్దార్ బుచ్చి సుందరరామయ్యకు జై!" అంటూ ఊళ్ళోకి తీసుకొచ్చారు.

అసలు చిత్రమేవిటంటే, స్వరాజ్యంరాగానే అంతవరకూ గాంధీని బండబూతులు తిట్టిన మా చిట్టి వెంకటలక్ష్మి పిన్ని, నెహ్రూగారికి నూటయాభై తులాలెట్టి బంగారపు కిరీటం చేయించి స్వయంగా తన తమ్ముళ్ళ ద్వారా ఢిల్లీ పంపించింది. (అది ఆయన పెట్టుకోలేదనుకోండి. ఏ సహాయనిధికో యిచ్చేసుంటారు.) గాంధీగారిని గోడ్సే చంపేసినరోజల్లా వుపవాసం వుండి యధావిధి అవుపోసన వడ్డించుకుని భోజనం చేసింది ఆ మర్నాడో, మూడోనాడో.

ఇంతకీ చెప్పొచ్చేదేమంటే చిట్టివెంకటలక్ష్మి కాంగ్రెస్ కల్తీకాంగ్రెస్ కనుక మా పిచ్చి సుందరరామయ్య ఆవిడ దేశభక్తిని రికగ్నైజ్ చెయ్యకుండా మా కుటుంబాల్తో కలిసివుండేవాడు. చిట్టి వెంకటలక్ష్మి తమ్ముళ్లు ఛోటా కాంగ్రెస్ నాయకులై పోయారు. కాని వాళ్ళవాళ్ళ ఆస్తులు, వ్యాపారాలు కాపాడుకుందుకే వాళ్లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటున్నారని ఊళ్ళో అందరికీ

తెలుసు. కాని ఎలక్షన్లలో మా పిచ్చి సుందరరామయ్యకు ఎగనెస్టుగా చిట్టి వెంకటలక్ష్మి తన తమ్ముడిని నిలబెట్టి స్వతంత్ర అభ్యర్థిగా నెగ్గించాలని చూసింది. కాని కాంగ్రెస్ పేరు చెప్పి కుక్కపిల్లను కుర్చీమీద కూర్చోపెట్టినా, ఓటుపడే రోజులు కనుక ఆ ఎలక్షన్లో చిట్టి వెంకటలక్ష్మి కుదేలయిపోయి, మళ్ళీ గాంధీని కాంగ్రెసుని లోపలలోపల్నే తిట్టుకుని తన వ్యాపార వ్యవహారాల్లో పడిపోయింది.

ఇవి వెనకటి గొడవలు. మావారికి బుచ్చి సుందరరామయ్యబావగార్ని గురించి లెక్చరివ్వడానికి నాకు ఓపికలేదు. ఇప్పుడతను చాలా పెద్దవాడు. కాని కాంగ్రెసుని తిడుతున్నాడు. స్వరాజ్యానికి మనం అన్‌ఫిట్. చూడండి మళ్ళీ మనవాళ్లు ఈ స్వాతంత్ర్యాన్ని ఏ అమెరికాకో రష్యాకో అమ్మేస్తారు అని అప్పుడే మనవాళ్ళు బేరంపెట్టేసినట్లు అరుగు మీద కూర్చుని గొణుక్కుంటూ వుంటాడు.

"మీకు జ్ఞాపకంవుందా! మన పెళ్ళిపందిట్లో మీరు మంగళసూత్రం కడుతూండగా "బోలో స్వతంత్ర భారత్‌కి జై! మహాత్మాగాంధీకి జై!" అని కేకలు పెట్టింది ఈ పిచ్చి సుందరరామయ్య బావేనండి" అన్నాను. మా వారు చాలా భయపడిపోయి బిక్కమొహం వేసుకుని నిలబడ్డారు – "మేకపాలు పట్రండి కాఫీకి" అన్నాను.

"మేకపాలెక్కడ దొరుకుతాయ్" అని మావారు లోపల గాంధీని పైకి మా పిచ్చి సుందరరామయ్య బావను తిట్టుకుంటూ వీధిన పడ్డారు. ఆయన అలా వెళ్ళారో లేదో మా కాంగ్రెసుబావయ్య వచ్చారు. "ఏడే వీడూ?" అని వెతుక్కుంటూంటే "మేకపాలకోసం వెళ్ళారన్నా "ఎందుకే వాడ్ని పంపావూ? నేను మేకపాలు దొరకనప్పుడు ఒఠ్ఠి డికాక్షన్ పుచ్చుగుంటా – అవునూ. నీ మొగుడికి ఒంటినిండా కురుపులు తగ్గాయా?" అని అడిగాడు. నేను తెల్లబోయా నోట మాటరాక. "అదే లేవే నీ పెళ్ళికొచ్చినపుడు తెగ బరుక్కుంటూవుండేవాడు. బంకమన్ను పట్టించుకుని కాలవలో స్నానం చేయమను. దురదలూ గిరదలూ ఉండవు." ఇంతలో మా వారొచ్చారు డబ్బాపాలకి పనికి వచ్చే డబ్బా చేత్తోపట్టుకుని! "ఏవిట్రా డబ్బాపాలు తాగుతున్నావా? పచ్చికూరలు తిను. గోంగూరలో ఐరనుంది. తోటకూరలో గోల్డుంది. అరటిపళ్ళలో కార్బోహైడ్రేట్సున్నాయి. కందిపప్పులో బి విటమిన్లున్నాయి. అవి తిను. ఎ హెల్దీనేషన్ విత్ హెల్దీబాడీస్.... వీడేవిటే నువ్వు చేత్తో తోస్తే గుమ్మం అవతలకెళ్ళి పడేటట్లున్నాడు" అని పొట్ట ఎగరేసుకుంటూ నవ్వాడు. మావారి మొహం కందదుంపలా వుంది.

"అదికాదు బావయ్యా! మావారు సిగరెట్లలో సి. విటమిన్లున్నాయంటారు."

"ఛీ! ఛీ! సిగరెట్లలో 'సి' విటమినూ, బ్రాందీలో 'బి' విటమిన్లూ వుంటాయా? ఏవిరా నీకు ఎస్సెల్సీలో సైన్సులో ఎన్ని మార్కులొచ్చాయీ?" మావారికి కళ్ళనీళ్ళపర్యంతమైపోతోంది.

"డోంట్ యూజ్ సోప్! ఇదిగో బీరకాయపీచెట్టి రుద్దుకో – ఖద్దరు వాడు. ఎయిర్‌కండిషన్డు రూంలో వున్నట్లు చల్లగా వుంటుంది" అని తన బ్యాగ్‌లోంచి వేరుశెనగపలుకులు తీసి యిద్దరిచేతుల్లోనూ పోశాడు.

మా పిచ్చి సుందరరామయ్య బావ మాటల్ని వింటూ ఆ రాత్రల్లా చెరోవైపు కూర్చున్నాం బొమ్మల్లా. అతని లైఫ్‌లోని ట్రాజిడీ నాకు తెల్సు. డెబ్భయ్ ఏళ్ళ మనిషి ఓ యిల్లూ నా అన్నవారులేకుండా కాకిలా తిరుగుతున్నాడు. మనిషిని కదిపితే ఆప్యాయం ముద్ద. బావ వెళ్లిపోయినరోజు ఏడుస్తూ కూర్చున్నా. ఏడుస్తున్నావా అన్నారు. అవును, పెద్దవాడు మళ్లీ కనిపిస్తాడని నమ్మకమేవిటి? అన్నట్టు చెప్పడం మరిచా. అతని మూడో బావమరిది కాంగ్రెస్ ఎమ్మెల్యే. కంట్రాక్టరు. చిట్టివెంకటలక్ష్మి హైదరాబాద్‌లో స్థలాల్ని కొని మళ్ళీ అమ్మి లక్షలకు లక్షలు గడించింది.ఆవిడ యిప్పుడు గొప్ప దైవభక్తురాలు... చీటీ యిస్తే గవర్మెంటులో ఏ పనైనా ఎవరైనా యిట్టే చేసిపెడతారు. మా బావయ్య అప్పటికీ యిప్పటికీ గాంధీ పిచ్చోడు. కాంగ్రెసు వారు యిచ్చిన భూమికి పన్నుకట్టలేకపోతే ప్రభుత్వం వారు కలిపేసుకున్నారు.

తలకు బంకమట్టి పట్టించుకుని గుండ్రాయితో ఒళ్లు రుద్దుకుంటూ కాంగ్రెసుని తిట్టుకుంటూ, డబ్భై ఏళ్ళ ముసలి భక్తుడెవరైనా కనిపిస్తే అతను తప్పకుండా మా పిచ్చి సుందరరామయ్య బావే అని గుర్తుంచుకోండి.

# రచయిత్రుల తెలుగు

**యాం**డీ గురూ గారూ! హనుమాయమ్మల నవల్స్ రెండు చదివాను అండం రైటా. రెండు హనుమాయమ్మల నవల్సుచదివాను అండం రైటా అని మా వార్ని నచకేతుడు యముడ్ని అడిగినట్టు దేహవంతా సందేహాల్తో నిండిపోయి తహతహలాడ్తూ ప్రశ్నించాను.

"ఛీ అవతలికి పో సీరియల్దానా!" అని వారు ఛీత్కారంచేశారు. నేను సీరియల్స్ తెగ చదువుతాననీ సీరియల్స్ తప్ప (బంగాళాదుంపకూర తప్ప మరోటి ముట్టనని ప్రమాణంచేసినట్లు) మరోటి ముట్టననీ, అంచేత నేను చెడిపోయానని మావారి థీరీ. నా ఆలోచన్లూ, నా భాషా, నా టేస్టూ నేను చదివే సీరియల్స్ వలన కండిషనై పోతాయని మా యముడిగారి తాత్పర్యం. సీరియల్స్ రాసే రచయిత్రులకి తెలుగురాదనీ, భాషరాదనీ, వాళ్ళుచేసే సాహిత్య సేవ సాహిత్యహింసాకాండ అనీ మావారికో స్పెషల్ ప్రెజుడిస్ వుంది. అది వాళ్ళనేమనలేక నామీద చూపిస్తుంటారు. నాకు బాగా తెలుగు రాదనుకోండి. మావారికీ రాదనే నా అభిప్రాయం. హి ఆల్సో డజ్నాట్‌నో – అనగా అతగాడిక్కూడా యంతమాత్రం తెలుగు తెలీదు. హనుమాయమ్మ నవల్స్‌మీద నేను మైసూర్‌పాక్ పందెంవేశాను. వాళ్ళకు తెలుగు రాదంటున్నారు గదా! మరివారు రాసేదంతా హాట్ కేక్స్‌లాగా చదువుతున్నారని చెప్పబడుతున్నది కదా. దీని భావమేమి తిరుమలేశ అని మా యముడిగార్ని నిలేసి అడిగాను. షటప్ అన్నారు. మీరే షటప్పు – పాప్యులర్‌గా రాస్తున్నందుకు మీరు ఉడుకు మోత్తనంకొద్దీ "టెల్గూ లాంగ్వేజీ" వారికి రాదని అంటున్నారుగాని